సాక్షి నిజామాబాద్

ఆదివారం। 6। ఆగస్టు। 2023



స్వయం ఉపాధితో ఎదగాలి

సెక్స్ వర్కర్లు ఆ వృత్తి నుంచి బయటకు వచ్చి స్వయం ఉపాధి పొంది ఎదగాలని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు.

- 10లో ▸



సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్..

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం మహిళలకు 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నట్లు డీఆర్‌డీవో తెలిపారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /23.0

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఐదు కొత్త గ్రామపంచాయతీలు

ఆర్మూర్ : ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో ఐదు కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూర్ మండలం పరిధిలోని పల్లె (చేపూర్ గ్రామపంచాయతీకి అనుసంధానం).

మాక్లూర్ మండలంలోని రామస్వామి క్యాంప్ (కల్లెడ గ్రామపంచాయతీకి అనుసంధానం),మెట్టు (బొంకన్‌పల్లి గ్రామపంచాయతీ అనుసంధానం). నందిపేట్ మండలంలోని జోజిపేట్ (వెల్మల్ గ్రామపంచాయతీకి అనుసంధానం), రైతు ఫారం (కౌల్పూర్ గ్రామ పంచాయతీకి అనుసంధానం). గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ అభివృద్ధికి రూ. 30 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి రూ. 30 కోట్లు మంజూరు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నిధులతో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. పట్టణ శివారులోని గూండ్ల చెరువు, మల్లారెడ్డి చెరువు, పెర్కిట్ చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామన్నారు.

జాతీయ అవార్డుల వెనుక పంచాయతీ కార్మికుల కష్టం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : శాసన సభలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సభలో మాట్లాడారు. నెలరోజులుగా పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె న్యాయమైందని అన్నారు. తాను 1981లో చీమన్‌పల్లి సర్పంచ్‌గా పని చేసినప్పుడు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు జీతం రూ. 50 నుంచి రూ100 చెల్లించేవారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులకు నెలకు రూ. 9,500 చెల్లిస్తున్నారన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేస్తూ డంప్ యార్డులకు చెత్తను చేరవేయడానికి పంచాయతీ కార్మికులు చాలా కష్టపడుతున్నారని అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని రెండు గ్రామాలు జాతీయ అవార్డులు పొందడం ఆనందంగా ఉందని, దాని వెనుక పంచాయతీ కార్మికుల కష్టం కూడా ఉందని బాజిరెడ్డి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి జీతాలు పెంచాలని కార్మికుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నానని సభాముఖంగా కోరారు. బాజిరెడ్డి విజ్ఞప్తి మేరకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించి సమస్యను నమోదు చేసుకున్నారు.

అమూల్యమైనది స్నేహం..

నా స్నేహితురాలితో స్నేహం వల్లే..



మా నాన్న ఇద్దరు ఆడ పిల్లలు పుట్టగానే అమ్మను వదిలేశాడు. నాకు కళ్యాణి పరిచయం కాగా మంచి స్నేహంగా మారింది. వాళ్ల నాన్నే నన్ను కూతురిలా చూసుకుంటాడు. ఇది కేవలం నా స్నేహితురాలి స్నేహం వల్లే సాధ్యమైంది. గంటకు ఒకసారి ఫోన్, మెసేజ్ ఇలా ఏమీ ఉండవు. మేము వారానికి, నెలకు, ఏడాది, ప్రతి రోజూ కలిసిన ఒకే రకమైనా స్నేహం మా మధ్య ఉంటుంది. నిజమైన ఫ్రెండ్స్ ఒకేలాగా ఉంటారు. – పునీత, బీటెక్



'సాక్షి' చర్చాగోష్టిలో పాల్గొన్న బీటెక్ విద్యార్థినులు

- మరిన్ని అభిప్రాయాలు 8వ పేజీలో..

నెగెటివ్ అయినా.. పాజిటివ్ అయినా



నేను చదువుకునే రోజుల్లో కుటుంబంతో పాటు మా నాన్నే బెస్ట్ ఫ్రెండ్. నాకు రెండు సంవత్సరాల క్రితం బెస్ట్ ఫ్రెండ్ దొరికింది. అప్పటి నుంచి మా మధ్య మంచి బాండింగ్ ఉంది. స్నేహం చేసినప్పటి నుంచే పాజిటీవ్ అయినా, నెగిటీవ్ అయినా తీసుకోవాల్సిందే. – చందన, బీటెక్

- స్నేహంపై విస్తృత అభిప్రాయాలు వ్యక్తం చేసిన బీటెక్ విద్యార్థినులు
- 'సాక్షి' ఆధ్వర్యంలో చర్చాగోష్టి
- నేడు స్నేహితుల దినోత్సవం

నిజామాబాద్‌నాగారం/మాక్లూర్: సృష్టిలో స్నేహం అమూల్యమైనదని కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం ఉంది. ఈ నేపథ్యంలో కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో 'స్నేహం'పై చర్చగోష్టి జరిగింది. పలువురు విద్యార్థినులు స్నేహం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. మరి కొందరు చిన్ననాటి స్నేహితులతో తమ అనుభవాలను గుర్తుచేసుకుని కంట తడి పెట్టుకున్నారు. తల్లిదండ్రులతో సైతం చెప్పుకోలేని సమస్యలను స్నేహితులతో చెప్పుకునే అవకాశ ముంటుందన్నారు. జీవితాంతం కడవరకు స్నేహం నిలిచి ఉండేలా ఒక్క స్నేహితురాలు/స్నేహితుడిని సంపాదించుకుంటే దాన్ని మించిన ఆస్తి లేదన్నారు. స్నేహితుల వద్ద ఉన్న సొతంత్రత మరెవరి వద్ద ఉండ దన్నారు. అమూల్యమైన స్నేహాన్ని కాపాడు కోవాలన్నారు. చర్చాగోష్టిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి సాయరెడ్డి, ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ మహిపాల్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తుమ్మాటి భద్రారెడ్డి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ రాజ్‌కుమార్, ఆర్‌సీ ఇన్‌చార్జి సంజీవ్, పోశెట్టి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



మూడో తరగతి నుంచి ఒక్కరే..



మూడో తరగతి నుంచి నాకు సాధిక అనే స్నేహితురాలు ఉంది. స్కూల్ నుంచి రాగానే నేరుగా వాళ్ల ఇంటికి వెళ్తాను. ఇంట్లో కన్నా నందిని దగ్గరికే ఎక్కువగా గడుపుతాను. వాళ్ల అమ్మనాన్న ఇలా ఎవరైనా సరే మేము ఇద్దరం కలిసి ఉన్నామంటే చాలు స్నేహం అంటే ఇలా ఉండాలని అంటారు. – నందిని, బీటెక్

కరోనా సమమంలో..



నాకు చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. 'బలగం' సినిమా మాదిరిగా 8,9 మంది ఫ్రెండ్స్ ఉన్నారు. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు మా నాన్నకు కరోనా వచ్చింది. ఆ సమయంలో భయపడుతున్న నాకు నేను న్నానంటూ నా స్నేహితురాలు ధైర్యం చెప్పింది. తన స్నేహం వల్లే నేను మళ్లీ మామూలు మనిషిని అయ్యాను. ఆ సమయంలో నాకు బెస్ట్ ఫ్రెండ్ లభించింది. – లహరిక, బీటెక్

నడక కలిపిన స్నేహం

- పాలిటెక్నిక్ మైదానంలో ఉదయం నడకలో 30 ఏళ్లుగా..
- ఒక్కరోజు వాకింగ్‌కు రాకున్నా రోజూ రూ.50 జరిమానా చెల్లించేలా నిబంధన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : స్నేహం ఎప్పుడు, ఎక్కడ, ఎలా మొదలవుతుందో అంచనా వేయలేం. అలాంటి నేపథ్యంలో నిజామాబాద్ పాలిటెక్నిక్ మైదానంలో ఉదయం నడకతో 16 మంది మధ్య స్నేహం చిగురించింది. ఈ స్నేహం గత 30 ఏళ్లుగా మరింత బలపడుతూ వచ్చింది. నగరానికి చెందిన వివిధ వృత్తులు, వ్యాపారాల్లో ఉన్న ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మంచాల జ్ఞానేందర్ గుప్తా, ప్రసాద్, గంగారెడ్డి, వెంకటరమణ, సంతోష్, అశోక్, శ్రీహరి, ప్రతాప్, కాశీనాథ్, వినోద్, వీరేష్, రంగన్న, సురేందర్, విశ్వనాథం, అశోక్‌గౌడ్ అనే 16 మంది మూడు దశాబ్దాలుగా ఈ స్నేహం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం ప్రత్యేక నిబంధన ఏర్పాటు చేసుకున్నారు. ఈ నిబంధన మేరకు ఈ బృందంలో ఎవరైనా సరే, ఊళ్లకు వెళ్లినప్పటికీ, అనారోగ్యం కలిగినప్పటికీ, ఇతరత్రా కారణాలతో వాకింగ్‌కు గైర్హాజరైతే రోజుకు రూ.50 చొప్పున జరిమానా కట్టాల్సిందే. ఇలా జమ అయిన జరిమానా మొత్తాన్ని ప్రత్యేక సందర్భాల్లో 16 మంది కలిసి సరదాగా ఖర్చు పెడుతూ వస్తున్నారు. వీరి స్నేహం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.



16 మంది మార్నింగ్ వాక్ స్నేహితుల బృందం

గెలిచే నాయకులకే టికెట్లు

- సీనియారిటీకి ప్రాధాన్యత లేదు..
- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నవీపేట : రానున్న అసెంబ్లీ ఎన్నికలలో గెలిచే నాయకులకే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్లు కేటాయిస్తుందని మాజీ మంత్రి సదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండలంలోని జన్నెపల్లి, నాళేశ్వర్, నిజాంపూర్, శాఖాపూర్, సిరన్‌పల్లి గ్రామాలలో ఆయన శనివారం సుడిగాలి పర్యటన చేశారు. సిరన్‌పల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహూల్ గాంధీ, ఖర్గే, రేవంత్‌రెడ్డిల పర్యవేక్షణలో అన్ని నియోజకవర్గాలలో సర్వేలు చేశాక టికెట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. టికెట్ల పంపిణీలో సీనియారిటీకి ప్రాధాన్యత ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడ్డాక నామినేటెడ్ పోస్టులను సీనియర్లకే ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, గెలుస్తాడనే నమ్మకం కలిగిన నాయకులకే పక్కాగా టికెట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ బలహీనపడిన కొన్ని జిల్లాలలో పటిష్టం చేసేందుకు పగడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒక నియోజకవర్గ నాయకులు మరొక నియోజకవర్గంలో ప్రచారం చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో 70 నుంచి 75 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులకు గురైన మోటార్లను పట్టించుకోవడం లేదని, ఫలితంగా రానున్న రోజుల్లో రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. టీఎస్ఐడీసీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొత్త రహదారులకు నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం మరమ్మతులకు గురైన రోడ్లను పట్టించుకోవడం లేదన్నారు. కోతలకు గురైన ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. నాళేశ్వర్ మాజీ సర్పంచ్ మగ్గారి నర్సింగ్‌రావ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, మండల నాయకులు సుధాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, ప్రదీప్‌రావ్, గోవర్ధన్‌రెడ్డి, బాబు, మూస తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

సదరం సర్టిఫికెట్‌లకు స్లాట్‌ల గండం

- దివ్యాంగుల పాట్లు
- 10 నిమిషాల్లోనే ముగిసిన స్లాట్‌లు
- నెలల తరబడి మీ సేవా కేంద్రాల చుట్టూ చక్కర్లు



జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ మీసేవా కేంద్రం వద్ద స్లాట్‌ల కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులతో ఖైసర్

డొంకేశ్వర్ /మోర్తాడ్ : సదరం స్లాట్‌ల కోసం జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా కొన్ని స్లాట్‌లు మాత్రమే ఇవ్వడంతో అందరికీ సరిపోవడం లేదు. దీంతో స్లాట్‌లు బుకింగ్ చేసే రోజు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయితే అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. దివ్యాంగులకు వికలాంగత్వాన్ని నిర్ధారించడానికి సెర్ప్ శాఖ ప్రతి నెలా సదరం క్యాంపులను నిర్వహిస్తోంది. జిల్లాలో నెలకు మూడు రోజుల మాత్రమే నిర్వహిస్తున్నారు. అది కూడా అధికారులు కేటాయించిన తేదీల్లోనే. వైద్యులు ఒక్క రోజుకు 40 మందిని చూసేందుకు మాత్రమే అవకాశం ఉంటుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా సదరం స్లాట్‌లను బుక్ చేసుకోవడానికి దివ్యాంగులు ఎగబడుతున్నారు. ఒక్కో మీ సేవా కేంద్రం వద్ద పదుల సంఖ్యలో జనం ఉంటున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి 9, 23 తేదీల్లో సదరం శిబిరాలను నిర్వహించడానికి అధికారులు శనివారం స్లాట్‌ను ప్రారంభించారు. స్లాట్‌లు విడుదల చేసిన పది నిముషాల్లో స్లాట్‌లన్నీ బుక్కయ్యాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016కు పెంచడంతో సదరం స్లాట్‌లకు డిమాండ్ బాగా ఏర్పడింది. అనర్హులు కూడా సదరం స్లాట్‌లు చేసుకుని క్యాంపులకు వెళ్తున్నారు. దీంతో అర్హులైన దివ్యాంగులకు స్లాట్‌లకు అవకాశం దొరకడం లేదు.



■ మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన సాన్వికి చిన్న తనం నుంచి వినికిడి లోపం ఉంది. ఆసరా, ఇతర పథకాల కింద లబ్ధిపొందాలంటే సాన్వికి సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంది. ఏడాదిన్నర కాలం నుంచి సదరం క్యాంపులో పాల్గొనడానికి స్లాట్ బుక్ చేసుకునేందుకు చిన్నారి తండ్రి రమేష్ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. స్లాట్‌ల సంఖ్య పరిమితంగా ఉండటంతో సాన్వికి సదరం క్యాంపునకు హాజరయ్యే అవకాశం లభించలేదు. ఇది ఒక్క సాన్వికి ఎదురైన సమస్యనే కాదు. ఎంతో మంది దివ్యాంగులకు సదరం క్యాంపు స్లాట్‌లు బుక్ కాకపోవడంతో సర్టిఫికెట్‌లను పొందలేకపోతున్నారు.

స్లాట్‌ల సంఖ్యను పెంచాలి

పట్టణాల్లోని దివ్యాంగులకు స్లాట్‌లు దొరకడం కష్టంగా మారింది. పల్లెల నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. స్లాట్‌లు చేసే రోజు ఉదయం ఆరింటికి వచ్చి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాసినా స్లాట్‌లు లభించడం లేదు. మీ సేవా నిర్వాహకులు ప్రత్యేకంగా అదనపు స్లాట్‌లు కేటాయిస్తే బాగుంటుంది. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ నాయకులు, నిజామాబాద్

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

బోధన్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జీపీ కార్మికులు 31 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరితో వ్యవహరిస్తోందని జీపీ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పేర్కొన్నారు. జీవో 60 ప్రకారం కార్మికుల కనీస వేతనాలు పెంపుదల, ఉద్యోగభద్రత అంశాలపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు.నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం పట్టణ కేంద్రంలో జీపీ కార్మికులు భారీ ర్యాలీ, ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో ఆఫీ సు అధికారికి నాయకులు వినతి పత్రం అందించారు. బోధన్, ఎడపల్లి, రెంజల్, రుద్రూర్, కోటగిరి, వర్ని మండలాల నుంచి కార్మికులు ర్యాలీకి తరలివచ్చారు. కార్మిక సంఘాల జేఏసీ జిల్లా నాయకులు నూర్జహాన్, మల్లేష్, ఖాజామోహినొద్దీన్, డివిజన్ ప్రతినిధులు శంకర్‌గౌడ్, నన్నెసాబ్, సాగర్, జంగం గంగాధర్, పోశెట్టి, శ్రీను, సాయిలు పాల్గొన్నారు.



బోధన్‌లో జీపీ కార్మికుల భారీ ర్యాలీ



బోధన్ ఆర్డీవో ఆఫీసులో అధికారికి వినతి పత్రం అందజేత

రుణమాఫీ అర్హతపై స్పష్టత కరువు

- అర్హులైన రైతుల సమాచారం లేదంటున్న వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు
- రాష్ట్ర స్థాయి నుంచి రుణమాఫీ మానిటరింగ్
- రైతుల్లో గందరగోళ పరిస్థితి

మోర్తాడ్(బాల్కొండ) : నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత రుణమాఫీపై ప్రభుత్వం కీలక ప్రకటన చేయగా అర్హులైన రైతులు ఎవరు, అనర్హులు ఎవరో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొంది. రుణమాఫీకి సంబంధించి అర్హుల జాబితా వ్యవసాయ శాఖ వద్ద కానీ బ్యాంకుల్లోనూ లేకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఈనెల 3 నుంచి రుణమాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడం మొదలైందని ప్రకటించింది. రైతుబంధు సొమ్ము మాదిరిగానే రుణమాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేస్తారని ప్రభుత్వం ప్రకటించినా ఈ రోజు వరకు తమ ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమ కాలేదని అనేక మంది రైతులు వెల్లడించారు. రుణమాఫీ అర్హుల జాబితాల కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లగా తమ వద్ద సమాచారం లేదని ఆశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారనే నమ్మకంతో ఖాతాలను పరిశీలిస్తే ఖాతాల్లోను సొమ్ము జమ కాలేదని రైతులు చెబుతున్నారు. బ్యాంకర్లు కూడా తమ వద్ద రుణమాఫీ లబ్ధి పొందిన రైతుల సమాచారం ఏది లేదని చెబుతున్నారు. గతంలో రూ. 25 వేల నుంచి రూ.50 వేల వరకు రుణమాఫీ జరుగగా వారి వివరాలను మాత్రం అప్పట్లో అందించారని బ్యాంకర్లు తెలిపారు. ఇప్పటి వరకు 45,812 మంది రైతులకు గతంలో మాఫీ సొమ్ము చేతికి అందింది. ఇంకా 2,91,188 మంది రైతులకు రుణమాఫీ వర్తించాల్సి ఉంది. వ్యవసాయ శాఖ, బ్యాంకర్ల వద్ద రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలను అందుబాటులో ఉంచితే రైతుల్లో నెలకొన్న గందరగోళం తొలగిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రుణ మాఫీ లబ్ధిదారుల జాబితాలను విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

వర్క్‌షాప్‌లతో నాణ్యమైన వైద్య సేవలు



నిజామాబాద్ సిటీ: వైద్య విభాగంపై నిర్వహించే వర్క్‌షాప్‌లు మెరుగైన వైద్యం అందించేందుకు దోహదపడుతాయని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర అన్నారు. శనివారం నిజామాబాద్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర, నిజామాబాద్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో, యశోద ఆస్పత్రి సౌజన్యంతో రెండురోజుల ఆర్థోపెడిక్ జాతీయ సదస్సు ప్రారంభం అయ్యింది. ఇందిర మాట్లాడుతూ ఆర్థోపెడిక్ విభాగంలో వైద్యులు మరింత నైపుణ్యంగా ఆపరేషన్లు చేసేందుకు, పీజీ విద్యార్థులు నేర్చుకునేందుకు ఈ వర్క్‌షాప్‌లు ఉపయోగపడుతాయన్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు రమేష్ సేన్ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైనట్లు చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్ ఇప్పటి వరకు హైదరాబాద్‌లో తప్పా ఎక్కడ జరగలేదని, తొలిసారిగా నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వైద్యులు ఉదయ్‌భాస్కర్, విజయ్‌భాస్కర్, తిమ్మారెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, కిరణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పీఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్తి స్థాయి నేర విచారణ కీలకం



ఖలీల్‌వాడి: నేరాలు జరిగినప్పుడు పోలీసు, అటవీ అధికారులు నిర్వహించే పంచనామా, రిమాండ్ రిపోర్ట్, చార్జిషీట్లు కీలకమైనవని నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో పోలీసు, అటవీశాఖ అధికారుల కోసం నిర్వహించిన సెమినార్‌లో పలు నేర పరిశోధన అంశాలను వివరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మహమ్మద్ రహిమొద్దీన్, భూసారపు రాజేష్ పంచనామా, రిమాండ్ రిపోర్టు, చార్జిషీట్‌ల రూపకల్పన విధివిధానాల గురించి వివరించారు.

అమూల్యమైంది స్నేహం

'సాక్షి' చర్చాగోష్టిలో విద్యార్థులు



నిజామాబాద్‌నాగారం/మాక్లూర్: స్నేహం అమూల్యమైనదని కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు అన్నారు. కళాశాల లో 'సాక్షి' ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని స్నేహంపై నిర్వహించిన చర్చాగోష్టిలో విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ సాయారెడ్డి

ఆదుకునేలా ఉండాలి



స్నేహం అంటే ఆటలు, పాటలు మాత్రమే కాదు. కష్టాలు, బాధలు వచ్చినప్పుడు ఒక్కరినొక్కరు ఆదుకునేలా ఉండాలి.

– సీహెచ్ శివాని

బెస్ట్ ఫ్రెండ్ ఒక్కరే..



ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో మంది స్నేహితులు ఉంటారు. కానీ బెస్ట్ ఫ్రెండ్ మాత్రం ఒక్కరే ఉంటారు. వారితోనే అన్ని విషయాలు షేర్ చేసుకుంటాం.

– నమ్రత

స్నేహం అంటేనే నిజాయితీ



స్నేహం అంటేనే నిజాయితీ. సరదాగా స్నేహం చేయొద్దు. తల్లిదండ్రులు కన్నా స్నేహితులతోనే ఎక్కువగా గడుపుతాం. నిజమైనా స్నేహితులను ఎప్పటికీ దూరం చేసుకోవద్దు.

– కార్తీక

స్వార్థం ఉండొద్దు



స్నేహానికి స్వార్థం ఉండొద్దు. అవసరానికో, పనుల నిమిత్తం చాలా మంది స్నేహం చేస్తుంటారు. తమ పని పూర్తి కాగానే మిత్రులను పక్కకు పెట్టుతున్నారు. అలా చేయడం సరికాదు.

– ప్రసన్న

ఇలాంటి వేదికలతో స్నేహం మరింత బలపడుతుంది

ప్రతి మనిషి జీవితంలో స్నేహితులు ఉంటారు. చాలా మందికి బెస్ట్ ఫ్రెండ్స్ ఉంటారు. అయితే ఇలాంటి చర్చాగోష్టి వేదికల సమయంలో తన ఫ్రెండ్ చేసిన మంచి, సహాయం గురించి చెప్పుకుంటే అందరికీ తెలుస్తుంది. స్నేహానికి ఇస్తున్న విలువ అర్థం అవుతుంది. అలా చెబితే వారు కూడా సంతోషంగా ఫీలవుతారు.

– సాయారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్

కుటుంబానికే ప్రాధాన్యత



నాకు చిన్నప్పటి నుంచి స్నేహితులు ఎక్కువగా లేరు. స్కూల్, కాలేజీల్లో కూడా ఎవరితో పెద్దగా మాట్లాడలేను. కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాను. ఏదీ ఏమైనా స్నేహానికి విలువ ఉంటుంది. ఇప్పుడిప్పుడే స్నేహం చేయడం ప్రారంభించాను.

– కృష్ణశ్రీ

సీనియర్లతో దోస్తానా



నేను చిన్నప్పటి నుంచి నాకన్నా పెద్దవారితోనే ఫ్రెండ్‌షిప్ చేస్తున్నా. పాఠశాలలో మా మా సీనియర్‌తో స్నేహం కుదిరింది. ఇప్పటికీ నా కష్టాసుఖాలు పంచుకుంటున్నాను.

– సింధు

బలంగా ఉండాలి



జీవితంలో స్నేహం బలంగా ఉండాలి. నమ్మకమైన మిత్రుల మధ్య ఫీలింగ్స్ అనంతంగా ఉంటాయి.

– లయ

గత జన్మబంధమే స్నేహం



ఇంటర్ చదువుకునే రోజుల్లో నా క్లాస్‌మేట్‌తో స్నేహం ఏర్పడింది. చాలా మంది స్నేహితులు ఉన్నా బెస్ట్ ఫ్రెండ్స్ ఒక్కరే ఉంటారు. గత జన్మబంధమే నాకు స్నేహం రూపంలో లభించిందని అనుకుంటున్నా.

– హర్షిత

మిత్రులను దూరం చేసుకోవద్దు



అందరికి స్నేహితులు పాఠశాలు, కళాశాలల్లో దొరుకుతారు. నాకు చిన్నప్పటి నుంచి లిఖిత అనే అమ్మాయితో స్నేహం ఏర్పడింది. ఆమెతో గడిపిన ప్రతి క్షణం మధురం. ఆమె ఈ మధ్యే చనిపోయింది. నా మిత్రురాలిని చాలా మిస్ అవుతున్నా. ప్రస్తుతం నాకంటు బెస్ట్ ఫ్రెండ్స్ ఎవ్వరు లేరు. మంచి మిత్రులను దూరం చేసుకోవద్దు.

– బింధు

కులమతాలకు అతీతం..



ప్రపంచంలో అన్నిటి కన్న విలువైనది స్నేహం ఒక్కటే. స్నేహంలో ఒక్కరినొక్కరు అర్థం చేసుకోవాల్సిందే. కుటుంబానికి ఎంత విలువ ఇస్తామో.. స్నేహానికి సైతం అంతకన్నా రెట్టింపు విలువ ఇస్తాం. ఎన్ని బంధాలు ఉన్నా కులమతాలకు అతీతంగా స్నేహం ఉంటుంది.

– అక్స

స్నేహితులను మనమే తయారు చేసుకుంటాం



దేవుడు అమ్మ, నాన్న, కుటుంబ సభ్యులు, బంధువులు ఇలా అందరినీ ఇస్తాడు. స్నేహితులను మాత్రం దేవుడు ఇవ్వడు. మనమే స్నేహాన్ని, స్నేహితులను వెతుక్కోవాల్సి ఉంటుంది. మంచి ఫ్రెండ్స్ ఉంటే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారు. అందుకే జీవితంలో మంచి ఫ్రెండ్స్‌ను తయారు చేసుకుని ఉన్నతంగా ఎదగండి.

– మహిపాల్, ఎలాక్ట్రానిక్ హెచ్‌వోడీ

అయ్యప్ప దీక్ష కలిపింది..

- 33 ఏళ్లుగా స్నేహాన్ని కొనసాగిస్తున్న ధన్‌పాల్, జ్ఞానేందర్‌గుప్తా



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిజామాబాద్‌కు చెందిన వ్యాపారులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మంచాల జ్ఞానేందర్ గుప్తా గత 33 సంవత్సరాలుగా తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. 1990లో అయ్యప్ప దీక్ష తీసుకున్న సమయంలో వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం మరింత పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం వీరిద్దరూ రోజుకొక్కసారైనా ఫోన్ మాట్లాడకుండా ఉండలేరు. రెండ్రోజుల కొకసారి తప్పనిసరిగా కలుస్తూ వస్తున్నారు. వినాయకుడు, అయ్యప్ప, శివుడి పూజ చేసిన తరువాతనే ప్రతిరోజూ బయటకు వచ్చే వీరిద్దరూ గత కొన్నేళ్లుగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వస్తున్నారు. సూర్యనారాయణ గుప్తా ధన్‌పాల్ లక్ష్మిబాయి, విఠల్‌గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ పేరుమీద, జ్ఞానేందర్ గుప్తా మంచాల శంకరయ్య ట్రస్ట్ పేరుమీద సేవలు నిర్వహిస్తున్నారు. జీవితాంతం తమ స్నేహాన్ని ఇలాగే కొనసాగిస్తామని, సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తామని వీరిద్దరూ చెబుతున్నారు.

సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: మహిళల సాధికారతలో భాగంగా పీఎంఎఫ్‌ఎంఈ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులు 35 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు డీఆర్‌డీవో చందర్ నాయక్ తెలిపారు. ప్రతి స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ట్రిజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో నిర్వహించిన జిల్లా మహిళా సహకార సమాఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సొంత భవనాలు లేని మండల సమాఖ్య (ఎంఎస్)లకు భవనాల కోసం స్థలం ఇప్పించాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేయాలని డీఆర్‌డీవో సూచించారు. అలాగే మార్కెటింగ్ విస్తరణ కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యేను అడగాలని పేర్కొన్నారు. స్త్రీనిధిలో 276 గ్రామ సంఘాల్లో 959 ఎస్‌హెచ్‌జీలలో 1800 మంది సభ్యులకు రుణాలను అందించినట్లు తెలిపారు. రుణాల రికవరీ కూడా 80శాతం ఉండటం హర్షణీయమన్నారు. స్త్రీనిధి ద్వారా డెయిరీఫారం, సోలార్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటోలు, జెనరిక్ మెడికల్ షాపులకు రుణాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు విప్లవ కుమారి, వనిత, లక్ష్మి, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమ, మారుతి, ఏపీఎం సరోజిని, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: సెక్స్‌వర్కర్లు ఆ వృత్తి నుంచి బయటకు వచ్చి స్వయం ఉపాధి పొంది ఎదగాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. న్యాయసేవా సంస్థ, స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ప్రాంగణంలో 'భారీ ప్రమాద సముదాయం న్యాయవాదం' అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. చిన్న, చిన్న వ్యాపారులు చేస్తూ గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం తోడ్పాటు తీసుకుకోవాలని, అందుకు న్యాయసేవ సంస్థ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సెక్స్ వర్కర్ల పిల్లల భవిష్యత్‌కు చదువే కొలమానం కావాలన్నారు. న్యాయసేవ సంస్థ, ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు పోలీస్ కమిషనర్(లా అండ్ ఆర్డర్) జయరామ్ మాట్లాడుతు సెక్స్ వర్కర్లకు పోలీసు శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల, పండ్లు, పూల వ్యాపారాలు చేసుకోవాలని అందుకు జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని అన్నారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్న పెట్టుబడితో దీర్ఘకాలిక స్వయం ఉపాధికి అవకాశాలు దండిగా ఉన్నాయని చెప్పారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, న్యాయ సేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, సీఐ నరహరి పాల్గొన్నారు.



క్రైం కార్నర్

ఆస్తి కోసం నానమ్మ హత్య



శోభారాణి (ఫైల్)

నిజాంసాగర్: ఆస్తి, నగల కోసం వరుసకు నానమ్మ అయ్యే మహిళను హత్య చేశాడో యువకుడు. మద్యం తాగించి అటవీ ప్రాంతంలో అంతమొందించి ఏమి ఎరుగనట్లు ఇల్లు చేరాడు. నిజాంసాగర్ మండలం మాగి శివారులోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. పిట్లం గ్రామానికి చెందిన దత్తుకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య అంజవ్వ మనవడు సంతోష్, మూడో భార్య శోభారాణి(45)ని ఈ నెల 2న నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శనకు బైక్‌పై తీసుకొచ్చాడు. ప్రాజెక్టును చూసిన తర్వాత బైక్‌పై నిజాంసాగర్‌కు చేరుకున్నారు. అక్కడ మద్యం తీసుకున్న సంతోష్ నానమ్మను మాగి శివారులోని అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరు కలిసి మద్యం తాగారు. అనంతరం సంతోష్, శోభారాణి తలపై కర్రతో కొట్టి చంపాడు. అనంతరం సాయంత్రం వేళ పిట్లం చేరుకున్నాడు. రాత్రి వరకు శోభారాణి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సంతోష్‌ను అడుగగా పిట్లంలో దించినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు పిట్లం పోలీస్ స్టేషన్‌లో శోభారాణి మిస్ అయినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని సంతోష్‌ను విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సంతోష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఘటన స్థలానికి తీసుకువచ్చారు. ఘటన స్థలాన్ని బాన్సువాడ రూరల్ సీఐ మురళి పరిశీలించారు. శోభారాణి ఒంటిపైన ఉన్న నగలతో పాటు ఆస్తి కోసం సంతోష్ హత్య చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

పేకాట స్థావరంపై దాడి

గాంధారి: గాంధారి సమీపంలో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు సదాశివనగర్ సీఐ రామన్ తెలిపారు. వారి నుంచి రూ.52,770, ఆరు బైక్‌లు, 10 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తిప్పారం రోడ్డులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్పీ ఎస్సై సంతోష్‌తో కలిసి దాడి చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మద్నూర్: మండలంలోని అవాల్‌గావ్‌లో శుక్రవారం రాత్రి షబ్బీర్ చౌస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది, వెంటనే ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపారు. శనివారం రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు.

కలుపు తీస్తుండగా యంత్రంలో ఇరుక్కుపోయిన కాలు

సదాశివనగర్: సదాశివనగర్‌కు చెందిన గంగొల్ల శంకర్ తన పత్తి చేనులో యంత్రంతో కలుపు తొలగిస్తుండగా యంత్రం అదుపుతప్పి కాలుపైకి దూసుకొచ్చింది. దీంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఠాణాలో ఉపసర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాచారెడ్డి: గ్రామంలో జరిగిన గొడవ విషయంలో తనకు న్యాయం జరగలేదని ఓ ఉపసర్పంచ్ ఠాణాలో ఆత్మహత్యకు యత్నించాడు. పాల్వంచ మండలం వాడి ఉప సర్పంచ్ సంగారెడ్డికి అదే గ్రామానికి చెందిన సమీప బంధువు బస్వారెడ్డికి వారం కిందట పొలం వద్ద దారి విషయంలో గొడవ జరిగింది. ఆ గొడవలో సంగారెడ్డి మెడలో ఉన్న బంగారు గొలుసు తెగిపోయి దాని లాకెట్ గల్లంతైంది. ఈ నేపథ్యంలో గ్రామంలో పంచాయితీ నిర్వహించి పెద్ద మనుషులు తీర్పు చెప్పారు. ఆ తీర్పుతో సంతృప్తి చెందని సంగారెడ్డి శనివారం క్రిమిసంహారక మందు తీసుకొని ఠాణాకు వచ్చి తనకు న్యాయం చేయాలంటూ తాగబోయాడు. అక్కడే ఉన్న ఏఎస్సై రామేశ్వరరెడ్డి ఆ మందును లాక్కొడానికి యత్నించాడు. అనంతరం పోలీసులు ఉపసర్పంచ్‌ను బయటకు పంపించారు.

మెంట్రాజ్‌పల్లిలో వివాహిత ఆత్మహత్య

- అత్తింటి వారే హత్య చేశారని బంధువుల ఆరోపణ
- అనుమానాస్పద మృతిగా కేసు



మగ్గిడి లలిత (ఫైల్)



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

డిచ్‌పల్లి: అత్తింటి వేధింపులకు మరో యువతి బలైంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన స్వప్న అలియాస్ లలిత(30)ను మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మగ్గిడి వినోద్‌కు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. వినోద్ కొద్ది రోజులు గల్ఫ్‌కు వెళ్లి వచ్చి ఇక్కడే పెయింటర్‌గా పని చేసుకుంటున్నాడు. ఈ దంపతులకు పిల్లలు కలుగలేదు. ఏడాదిగా గొడవలు మొదలయ్యాయి. పెద్ద మనుషుల పంచాయతీ నిర్వహించి సర్ది చెప్పడంతో కాస్త సద్దుమణిగాయి. అయితే మూడు రోజులుగా మళ్లీ గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున లలిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అత్త కమల గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే లలిత మృతి చెందింది. వెంటనే పోలీసులతో పాటు మృతురాలి తరపు బంధువులకు సమాచారం ఇచ్చారు. భర్త వినోద్ ఆ సమయంలో వేరే ఊళ్లో ఉన్నాడు. విషయం తెలియగానే ఇంటికి చేరుకున్నాడు. అదే సమయంలో మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చేరుకున్నారు. అత్త కమల, భర్త వినోద్‌తో పాటు ఆడపడుచులు అదనపు కట్నం తేవాలంటూ లలితను వేధించేవారని వారు ఆరోపించారు. లలితను భర్త, అత్త హత్య చేసి ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని, ఆమె ఒంటిపై ఉన్న గాయాలే అందుకు నిదర్శమని ఆగ్రహంతో ఇంటిపై దాడి చేశారు. మృతురాలి భర్త, అత్త ను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేష్ మృతురాలి బంధువులను సముదాయించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో బంధువులు శాంతించారు. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో పెదనాన్న సింగరి అబ్బయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి, వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భర్త వినోద్, అత్త కమలను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్ చేరుకుని లలిత మృతదేహాన్ని సందర్శించారు.

గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం



ప్రణవ్, వేణు మృతదేహాలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే కాకతీయ కాలువలో మెండోరా శివారులో శుక్రవారం గల్లంతైన నిజామబాద్‌లోని గాయత్రినగర్‌కు చెందిన వేణు(24), ప్రణవ్(19) మృతదేహాలు శనివారం కాలువలో లభ్యమయ్యాయి. శుక్రవారం నీటి విడుదలను నిలిపి వేసి కాలువలో గాలింపు చర్యలను ప్రారంభించారు. చీకటి పడటంతో గాలింపు ఆపి, శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. గల్లంతైన ప్రాంతానికి కొద్ది దూరంలో ప్రణవ్ మృతదేహం లభించింది. గల్లంతైన ప్రాంతంలోనే వేణు మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేవామని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

మంత్రి దిగ్భ్రాంతి

బాల్కొండ: కాకతీయ కాలువలో వేణు, ప్రణవ్ గల్లంతుపై రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అధికారులకు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. కాలువ వద్ద ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

మోర్తాడ్: మండలంలోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భ ఖనిజాల శాఖ అధికారులు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఎవరు ఇసుకను తరలించినా ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. సీజ్ చేసిన వాహనాన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

నవీపేట: మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన మేకల మారుతి(46) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మొదటి భార్య కాపురానికి రాకపోవడంతో మారుతి మహారాష్ట్రకు చెందిన రేఖను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో రేఖ పుట్టింటికి వెళ్లింది. మారుతి ఆమెను తీసుకు రావడానికి వెళ్లగా భర్తతో వచ్చేందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన మారుతి శుక్రవారం నిజాంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్యతో గొడవ పడి ఒకరు..

మాచారెడ్డి: భార్యతో గొడవ పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం పాల్వంచ మండలం ఇసాయిపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దాసరి స్వామి(35) అతని భార్య రోజా శుక్రవారం రాత్రి గొడవ పడ్డారు. ఉదయం పొలానికి వెళ్లని స్వామి మనస్తాపంతో పంట చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోడు భూమి విషయంలో ఘర్షణ



సిరికొండ: మండలంలోని జంగిలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల మెట్టు తండాలో పోడు భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. జరుపుల లింబాద్రి, జరుపుల సురేష్, జరుపుల మోహన్, గుగులోతు నాసీలాల్ వర్గం, గుగులోతు లింబాద్రి, గుగులోతు మంగిలాల్ వర్గం మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో గుగులోతు లింబాద్రి, మంగిలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన నలుగురికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై ఇరు వర్గాలు ఫిర్యాదు చేశారు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

